సాక్షి
సూర్యాపేట
బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



గంజాయి బస్తాలు లభ్యం

కోదాడ పట్టణ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన గంజాయి బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



నిందితుల కోసం గాలింపు

పాలకవీడు మండలం దక్కన్ సిమెంట్ పరిశ్రమ వద్ద పోలీసులపై దాడి నేపథ్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	586.50 అడుగులు
ఇన్‌ఫ్లో	:	3,42,506 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	3,42,506 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,495 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	3,549 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

● గాయత్రీ దేవిగా అమ్మవారు



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సూర్యాపేట పట్టణంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

ముందుగానే చెక్‌పోస్టులు!

ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా నిఘా

- నల్లగొండ, సూర్యాపేట జిల్లాల సరిహద్దుల్లో అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల ఏర్పాటు
- వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం



సూర్యాపేట జిల్లాలో..

వరి సాగు : 4.82 లక్షల ఎకరాలు	
దిగుబడి అంచనా : 10.30 మెట్రిక్ టన్నులు	
మార్కెట్‌కు వచ్చే ధాన్యం : 4,30,880 లక్షల మెట్రిక్ టన్నులు	
సన్నరకం : 2,36,289 లక్షల మెట్రిక్ టన్నులు	
దొడ్డురకం : 1,94,591 లక్షల మెట్రిక్ టన్నులు	
ఐకేపీ : 168	
పీఏసీఎస్ : 132	
ఇతర కేంద్రాలు : 32	
అవసరం ఉన్న గన్నీ బ్యాగులు : 1.7 కోట్లు	
ప్రస్తుతం ఉన్నవి : 45 లక్షలు ఉన్నవి	
త్వరలో రానున్నవి 12 లక్షలు	

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోకి రాకుండా అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద ఈసారి ముందస్తుగానే చెక్ పోస్టుల ఏర్పాటు చేయనున్నారు. వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు సిద్ధమవుతున్న తరుణంలో చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయనున్నారు. నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వచ్చే నెల మొదటి వారం నుంచి మార్కెట్‌కు ధాన్యం రానుంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రెండు జిల్లాల యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

నల్లగొండ జిల్లాలో 6.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా

నల్లగొండ జిల్లాలో కోతలు మొదలైన నేపథ్యంలో ఈసారి 13.44 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో రైతులు సొంత అవసరాలకు వినియోగించే ధాన్యం, మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యం పోగా, 6.30 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందుకోసం 375 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం అవుతోంది.

అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టులపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వం సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నందున ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం ఉమ్మడి జిల్లాలోకి రాకుండా యంత్రాంగం అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించింది. నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్, వాడపల్లి, సూర్యాపేట జిల్లాలో రామాపురం క్రాస్ రోడ్డు, ఏపీ సరిహద్దులోని అన్నారం చెక్‌పోస్టు, చింతలపాలెం మండలం దొండపాడు, మట్టపల్లి బ్రిడ్జి, చింత్రియాల బల్లకట్టు, చింతలపాలెం ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

10 శాతం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి

ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం తీసుకునే మిల్లర్లు కచ్చితంగా బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొనుగోళ్ల ప్రారంభానికి ముందే బ్యాంకు గ్యారంటీ పత్రాలను అందజేయాలని మిల్లర్లను ఆదేశించింది. మిల్లర్ల సామర్థ్యం, దానికి కేటాయించే ధాన్యాన్ని బట్టి 10 శాతం బ్యాంకు గ్యారంటీ తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. బ్యాంకు గ్యారంటీ ఇవ్వని మిల్లర్లకు ధాన్యం ఇవ్వొద్దని ప్రభుత్వం నిర్ణయించింది.

ధాన్యం కొనుగోలు లక్ష్యం 4.30 లక్షల మెట్రిక్ టన్నులు

సూర్యాపేట : వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. త్వరలో వరికోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తోంది. సుమారు 4.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు 336 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కాగా సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్న నేపథ్యంలో ఈసారి కూడా రెండు రకాలుగా సెంటర్ల ఏర్పాటు చేయనున్నారు.

మరో 25 రోజుల్లో..

జిల్లావ్యాప్తంగా 4.82 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. బోరుబావుల కింద మొదటగా, తర్వాత మూసీ ఆయకట్టు, సాగర్ ఆయకట్టులో విడతల వారీగా సాగు చేశారు. ఈ క్రమంలో బోరుబావుల కింద సాగైన వరి పంట మరో 25 రోజుల నుంచి కోతకు రానుంది. దొడ్డురకం ధాన్యం కోతలు ముందుగా ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు వీటిని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించే అవకాశం ఉండడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఐకేపీ ఆధ్వర్యంలో 168, పీఏసీఎస్ 132, ఇతరులు 36 చొప్పున సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

సెంటర్ల ప్రారంభంనాటిని గన్నీ బ్యాగులన్నీ..

జిల్లాలో సాగైన వరి పంటకు దాదాపు 10.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వానాకాలం సాగు చేసిన పంటలో సన్నరకం ధాన్యాన్ని రైతులు ఇంటి అవసరాల కోసం వాడుకుంటారు. ఇతర ప్రైవేట్ మార్కెట్లు, మిల్లులకు పోగా సన్నరకం ధాన్యం దాదాపు 2,36,289 మెట్రిక్ టన్నులు కొనుగోలు సెంటర్లకు వస్తుందని అధికారులు భావిస్తున్నారు. మరో 1,94,591 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం అమ్మకానికి రానుంది. ఈ మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి వీలుగా 336 సెంటర్లను ప్రారంభించాలని జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మొత్తం ధాన్యం కొనుగోలు కోసం 1.07 కోట్ల గన్నీబ్యాగులు అవసరం కానున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 45 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి.

● బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని కోర్టు ఆవరణలో మంగళవారం బతుకమ్మ ఆడుతున్న మహిళా జడ్జిలు, న్యాయవాదులు

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, చిత్రంలో ఎస్పీ

సూర్యాపేట : ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం సూర్యాపేట కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ (డీఆర్ఏ) కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌ల నియమ నిబంధనలు పాటించే వాటికి మాత్రమే అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న వారం లోపల తాత్కాలిక అనుమతి ఇచ్చి తర్వాత క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేసి అన్ని నియమ నిబంధనలు పాటిస్తే శాశ్వతంగా అనుమతి ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే నోటీసులు జారీ చేసి కారణాలు తెలుపుతూ తిరస్కరించాలని, మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలన్నారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ ఎక్కడైనా అర్హత లేని వారు వైద్యం, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డీఎంహెచ్ఓ పి.చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు జి.చంద్రశేఖర్, నాజియా, కోటిరత్నం, డిప్యూటీ డీఎంహెచ్ఓ జయ మనోహరి, మీడియా అధికారి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఇవ్వొద్దని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సంఘం నాయికులు

సూర్యాపేట : భవననిర్మాణ కార్మిక సంక్షేమ మండలి నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతుల మల్లయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులు రూ.346 కోట్లను ప్రైవేట్ కంపెనీకి బదలాయించడం అన్యాయమన్నారు. అనంతరం లేబర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలక సోమయ్య గౌడ్, కొత్తపల్లి శివకృష్ణ, మల్లెపాక నగేష్, బాలాజీ, నాగలక్ష్మి, రాజు, రంగయ్య, లింగయ్య, మహేష్, జలంధర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వేతనాలు ఇప్పించాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

సూర్యాపేట : ఐదు నెలలుగా జీతాలు లేకుండా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత ఏజెన్సీ ద్వారా వేతనాలు ఇప్పించాలని కోరుతూ టీఎస్ వ్యాన్, వీడియో కాన్ఫరెన్స్ ఇంజినీర్లు .. అదనపు కలెక్టర్ సీతారామారావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బందికి అయిదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక సంక్షోభానికి లోనవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జిల్లా ఇంజినీర్లు నవీన్ కుమార్, శ్రీను, ప్రేమానందం, వెంకట్, సైదులు, మధు, శంకర్, నగేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

సూర్యాపేటటౌన్ : మౌలిక వసతులు లేని సర్కారు పాఠశాలలను నాలుగైదు కలిపి ఒకే సముదాయంలో నిర్వహించాలని తద్వారా ఉపాధ్యాయుల కొరత తీరుతుందని ప్రభుత్వం చేసే ఆలోచన సరైంది కాదని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. డీటీఎఫ్ సూర్యాపేట జిల్లా శాఖ అధ్యక్షుడు పబ్బతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించి ప్రతి సంవత్సరం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలన్నారు. విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా ఉదయం అల్పాహారం, ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అర్.లింగయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు సీహెచ్.వెంకటేశ్వర్లు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వేణు, వెంకటేశ్వర్లు, ఆనంద భాస్కర్, సీహెచ్.యాదగిరి, సింహాద్రి, దేవేందర్, కవిత పాల్గొన్నారు.

అకడమిక్ కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అకడమిక్ కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు నల్లగొండలోని ఎన్జీ కళాశాల రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుగ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, బోధన అనుభవం కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు.

చోరీల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్

● ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : చోరీల నియంత్రణకు నిరంతం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా సెలవులకు ఎక్కువ రోజులు ఊర్లకు, దూరప్రాంతాలకు వెళ్లే ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇవీ.. ఎస్పీ సూచనలు

- సెలవుల్లో బయటికి వెళ్తున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి. సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్‌ను ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లేదా మీగ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వాలి.
- ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలి.



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

- మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. వాటికి చైన్‌తో లాక్ వేయడం మంచిది.
- నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మన్/ సెక్యూరిటీ గార్డ్/ సర్వెంట్ గా నియమించుకోవాలి.
- సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టకండి.

వైద్యాధికారులకు రక్షణ కల్పిస్తాం

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలు, రోగులతో పాటు సేవలందిస్తున్న వైద్యాధికారులకు రక్షణ కల్పిస్తామని జిల్లా ఎస్పీ నర్సింహ చెప్పారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఎస్పీ సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు.. పోలీస్ శాఖతో సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి మెడికో లీగల్ కేసులు నమోదు అయితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కల్పిస్తున్న వసతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రి ప్రాంగణంలో గల పోలీస్ అవుట్ పోస్టును పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, వైద్యాధికారులు డాక్టర్ విజయ్ కుమార్, డా.వినయానంద్, డా.లక్ష్మణ్, డా.మనీషా, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మూసీకి పోటెత్తిన వరద

● ప్రాజెక్టు తొమ్మిది గేట్లు ఎత్తివేత

కేతేపల్లి : మూసీ రిజర్వాయర్‌కు మంగళవారం ఎగువ నుంచి వరద ఉధృతి పెరిగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు తొమ్మిది క్రస్ట్‌గేట్లను ఎత్తి వరదనీటిని దిగువకు వదులుతున్నారు. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మంగళవారం ఉదయానికి ఇన్‌ఫ్లో 12,184 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టులో నీటి మట్టం 645 అడుగుల గరిష్ట స్థాయికి చేరువలో ఉండటంతో అధికారులు సోమవారం తెరిచిన 4క్రస్ట్‌గేట్లకు అదనంగా మంగళవారం మరో ఐదు క్రస్ట్‌గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 11,737 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు కొలిక్కి !



సూర్యాపేటటౌన్ : జిల్లాలో స్థానిక సంస్థల రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రెండు రోజులుగా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సంబంధిత శాఖ అధికారులతో కలిసి తీవ్ర కసరత్తు చేశారు. ప్రధానంగా జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఆర్డీఓలతో పాటు అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలతో రెండు రోజులుగా సమావేశాలు నిర్వహించారు. మండలాల్లో ఉన్న జనాభా, ఇందులో ఎస్సీ, ఎస్టీలకు గతంలో కేటాయించిన స్థానాలు, ప్రస్తుతం కేటాయించాల్సిన స్థానాలు, బీసీ జనాభా గతంలో రిజర్వేషన్, ప్రస్తుతం కేటాయించాల్సిన స్థానాలపై చర్చించారు. ఈ క్రమంలో 2019 రిజర్వేషన్ల వివరాలను సేకరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించగా మిగిలిన స్థానాలను జనరల్ కేటగిరీకి కేటాయించి మొత్తంగా 50శాతం స్థానాలను మహిళలకు రిజర్వ్ చేసేలా రిజర్వేషన్ల కసరత్తు జరిగినట్లు సమాచారం.

వీరి సమక్షంలోనే..

జిల్లాలో 486 గ్రామ పంచాయతీలు, 4388 వార్డులు, 235 ఎంపీటీసీ స్థానాలు, 23 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీ, సర్పంచ్‌ల రిజర్వేషన్లను ఆర్డీఓల సమక్షంలో, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీఓలు, జెడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్లను కలెక్టర్ ఆధ్వర్యంలో ఖరారు చేసినట్లు సమాచారం. ఏ స్థానం ఎవరికి రిజర్వ్ చేశారో తెలుసుకునేందుకు ఆశావహులు ప్రయత్నాల్లో ఉన్నారు. కాగా 2019 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 475 స్థానాలకు గాను ఎస్సీలకు 97 స్థానాలు, ఎస్టీలకు 111 స్థానాలు, బీసీలకు 65 స్థానాలను కేటాయించారు. ఇందులో జనరల్ కేటగిరిలో 202 స్థానాలు కేటాయించారు.

పనులు వదులుకొని వచ్చినా నిరాశే



తిరుమలగిరి: పీఏసీఎస్ కార్యాలయం ముందు బారులు తీరిన రైతులు



నూతనకల్: రాస్తారోకో చేస్తున్న రైతులు

తిరుమలగిరి (తుంగతుర్తి): రైతులకు యూరియా తిప్పలు తప్పడంలేదు. సరిపడా యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు రోజూ పీఏసీఎస్‌లు, మనగ్రోమోర్ కేంద్రాల బాటపడుతున్నారు. పనులన్నీ వదులుకొని రాత్రింబవళ్లు చాంతాడంత క్యూలో నిరీక్షించినా దొరకని పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల యూరియా కోసం రైతులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కార్యాలయం ముందు మంగళవారం ఉదయం నుంచి రైతులు బారులుదీరారు. టోకెన్లు ఉన్న రైతులకు ఒక్కొక్కరికి 2 బస్తాల చొప్పున యూరియా అందజేశారు. మిగిలిన రైతులకు టోకెన్లను అందించారు.

మూడు గంటల పాటు రాస్తారోకో

తిరుమలగిరి: యూరియా కోసం రైతులు నూతనకల్ మండల కేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై మంగళవారం సుమారు మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఇదే సమయంలో పీఏసీఎస్ కార్యాలయంలో బస్తాలు ఉన్నప్పటికీ రైతులకు వాటిని అందించకుండా ఆలస్యం చేయడంతో రైతులు కార్యాలయం షెట్టర్లను పగులగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో సమాచారం అందుకున్న సీఐ నర్సింహారావు, తహల్దార్ ఎం. శ్రీనివాసరావులు ధర్నా చేస్తున్న రైతుల వద్దకు వచ్చి వారితో మాట్లాడారు. నేటి వరకు టోకెన్లు ఇచ్చిన మాట వాస్తవమేనని ఈ నెల 19,20తేదీల్లో రావాల్సిన యూరియా లోడ్ రాక ఆకస్మత్తుగా టోకెన్‌తీసుకున్నవారు రావడంతో గందరగోళం ఏర్పడిందని తెలిపారు. టోకెన్‌లు ఇచ్చిన ప్రతి రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేసిన తరువాతనే కొత్త వారికి టోకెన్‌లు అందిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులు రాస్తారోకోను విరమించారు. పీఏసీఎస్ కార్యాలయంపై దాడి గురించి సిబ్బంది నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వట్టిఖమ్మంపహాడ్‌లో ఉద్రిక్తత



పోలీసుల బందోబస్త్ మధ్య లారీ నుంచి యూరియా దిగుమతి చేస్తున్న హమాలీలు

సూర్యాపేట : చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో మంగళవారం పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా పంపిణీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. లారీలో యూరియాలోడు రావడంతో పంపిణీ చేయాలని గ్రామస్తులు ఆందోళన చేస్తూ అడ్డుకున్నారు. తహసీల్దార్ ప్రకాశ్‌రావు అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పి 80 మందికి అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తహసీల్దార్ చెప్పిన విధంగా కాకుండా 60 మందికి మాత్రమే టోకెన్లు ఇవ్వడంతో మహిళా రైతులు వ్యవసాయ అధికారితో వాగ్వాదానికి దిగారు. పీఏసీఎస్‌కు వచ్చిన లోడ్ యూరియాను దింపనివ్వకపోవడంతో ఎస్ఐకి ఏఓ సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని లారీలో ఉన్న యూరియాను దిగుమతి చేయించి, పీఏసీఎస్ కార్యాలయంలో ఉంచారు. బుధవారం పంపిణీ చేస్తామంటూ అధికారులు వెళ్లిపోయారు.



వట్టిఖమ్మంపహాడ్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

క్లుప్తంగా

స్వర్ణగిరి క్షేత్రంలో వరలక్ష్మిదేవికి అభిషేకం



వరలక్ష్మి అమ్మవారికి అభిషేకం, హవనం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా మంగళవారం వరలక్ష్మీ అమ్మవారికి ఆలయ అర్చకులు అభిషేకం, హవనం నిర్వహించారు. అనంతరం సహస్ర కుంకుమార్చన సేవ నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం, తిరువీధి ఉత్సవ సేవ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలోని పాత శిల్పా హోటల్ వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి సుమారు సుమారు 50ఏళ్లు ఉంటాయని, హోటల్ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ మృతిచెందినట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కారు ఢీకొని గాయాలు

చౌటుప్పల్ రూరల్: హైవే వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం గరిడాకుంట గ్రామానికి చెందిన కట్టబోయిన రామలింగం(40) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లోని హయత్ నగర్‌లో నివాసముంటున్నాడు. పని నిమిత్తం మంగళవారం రామలింగం చౌటుప్పల్ దండు మల్కాపురం గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో గ్రామ పరిధిలోని చెరువు సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామలింగం ఎడమ కాలుకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌లోని వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామలింగం భార్య రాజలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుసుమ ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

వర్కర్‌గా చేరి పథకం ప్రకారం చోరీ

- మిర్యాలగూడ వైష్ణవి గ్రాండ్ రెస్టారెంట్‌లో చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్ట్
- రూ.66.50 లక్షలు రికవరీ
- వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని వైష్ణవి గ్రాండ్ రెస్టారెంట్‌లో చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం విలేకరులకు వెల్లడించారు. రాజస్తాన్ రాష్ట్రం జలోర్ జిల్లా రాణివార మండలం కోర్కా గ్రామానికి చెందిన మహ్మద్ రహీం ఖాన్ మిర్యాలగూడ పట్టణానికి బతుకుదెరువు కోసం వచ్చిన పట్టణంలోని సాగర్ రోడ్డులో గల వైష్ణవి గ్రాండ్ రెస్టారెంట్ ముందు టీస్టాల్‌లో మాస్టర్‌గా పనికి కుదిరాడు. ఈ క్రమంలో రెస్టారెంట్‌కు సంబంధించిన విషయాలను తెలుసుకుని, అందులో చోరీ చేసేందుకు గాను తన స్నేహితులైన రాజస్తాన్ రాష్ట్రం జలోర్ జిల్లా సాయిలా మండలం పోవ్రాపు గ్రామానికి చెందిన ఇక్బాల్‌ఖాన్, లాలూఖాన్‌తో కలిసి ఏపీలోని జగ్గయ్యపేటలో ఒక గదిని అద్దెకు తీసుకుని ప్రణాళిక రచించారు. పథకం ప్రకారం ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వైష్ణవి గ్రాండ్ రెస్టారెంట్ బయట రహీంఖాన్, లాలూఖాన్ ఉండగా.. ఇక్బాల్‌ఖాన్ మెట్లు ఎక్కి ఫస్ట్ ఫ్లోర్‌లోని చాంబర్ తలుపునకు ఉన్న తాళం పగులగొట్టాడు. చాంబర్ లోపలికి ప్రవేశించి కౌంటర్‌ను బద్దలుకొట్టి అందులో దాచిన రూ.80లక్షలను అపహరించి ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై జగ్గయ్యపేటకు పారిపోయారు. అనంతరం కొంత నగదును ముగ్గురు పంచుకుని వారి సొంత గ్రామాలకు వెళ్లి జల్సాలు చేశారు. రెస్టారెంట్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు, నల్లగొండ సీసీఎస్ పోలీసులతో కలిసి నాలుగు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. అయితే తీసుకెళ్లిన డబ్బులు అయిపోవడంతో వారు ముగ్గురు తిరిగి జగ్గయ్యపేటలోని గదిలో దాచుకున్న డబ్బులను తీసుకునేందుకు వచ్చారు. అప్పటికే జగ్గయ్యపేటలో నిఘా పెట్టిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. వారి నుంచి రూ.66.50 లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన నాలుగు బృందాలను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, నల్లగొండ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ నాగభూషణం, టూటౌన్ సీఐ సోమనర్సయ్య, ఎస్ఐలు సతీష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సీసీఎస్ ఎస్ఐలు విజయ్‌కుమార్, విష్ణు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా తొమ్మిది రోజులు నిష్టతో..

- మద్యం, మాంసం ముట్టకుండా నవరాత్రులు జరుపుకుంటున్న అభంగాపురం గ్రామస్తులు



అభంగాపురంలో దుర్గామాత విగ్రహం

మాడుగులపల్లి: మాడ్గులపల్లి మండలం అభంగాపురం గ్రామస్తులు దేవీ నవరాత్రి ఉత్సవాలను ఎంతో నిష్ఠగా జరుపుకుంటున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా గ్రామస్తులందరూ కలిసి కులమతాలకతీతంగా గ్రామంలో ఒకే అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో తొమ్మిది రోజులు గ్రామంలోని ఏ ఇంట్లో కూడా మద్యం, మాంసం ముట్టరు. ఈ ఆచారం గత నాలుగేళ్లుగా పాటిస్తున్నారు. చివరి రోజు భక్తులందరూ అమ్మవారికి కుంకుమార్చన చేస్తారు. ఇంత నిష్టగా పూజలు చేయడం వల్లనే అమ్మవారి కృపతో తాము ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉంటామని గ్రామస్తులు నమ్ముతున్నారు. దసరా రోజు కూడా గ్రామస్తులు మద్యం, మాంసం ముట్టకపోవడం విశేషం.

జాతీయ రహదారి పక్కన గంజాయి బస్తాలు లభ్యం

- కోదాడ పట్టణ శివారులోని మామిడి యార్డులో వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- స్వాధీనం చేసుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కోదాడ : కోదాడ పట్టణ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన గంజాయి బస్తాలను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా గంజాయి తరలిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి పక్కన కోదాడ పట్టణ శివారులో భారత్ పెట్రోల్ బంక్ వెంట ఖాళీగా ఉన్న మామిడి యార్డులో గంజాయి బస్తాలు వదిలి వెళ్లగా.. అటుగా వెళ్లిన స్థానిక రైతులు ఆ బస్తాలను చూసి వాటిలో ఏముందోనని కోదాడ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ శివశంకర్ వెంటనే తన సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకొని బస్తాలను పరిశీలించగా వాటిలో గంజాయి ఉన్నట్లు నిర్ధారించుకొని వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి సుమారు 110 కిలోలు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పట్టణ సీఐ శివశంకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ గంజాయిని ఏపీ నుండి మహారాష్ట్ర లేదా కర్ణాటకకు రవాణా చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున హైవే వెంట పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు పట్టుబడతామోనన్న భయంతో స్మగ్లర్లు గంజాయిని హైవే వెంట వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది. హైవే వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు టోల్‌గేట్ల నుంచి సమాచారాన్ని తెలుసుకొని గంజాయి రవాణా చేసిన వాహనాన్ని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో యువకుడిపై థర్డ్ డిగ్రీ..?

- ఎస్ఐ, పోలీస్ సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు



విలేకరులతో మాట్లాడుతున్న బాధితుడు సాయిసిద్ధు, కుటుంబ సభ్యులు

మిర్యాలగూడ అర్బన్: యూరియా కోసం నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నానని తనపై వాడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని దామరచర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన ధనావత్ సాయిసిద్ధు ఆరోపించాడు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో అతడు విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తపేట గ్రామంలో ఇటీవల తన అన్నను కొంతమంది కొట్టగా, వారిపై తాను తిరగబడ్డానని.. ఈ ఘటనకు సంబంధించి ఒకరిపై ఒకరం కేసులు పెట్టుకున్నట్లు సాయిసిద్ధు పేర్కొన్నాడు. అయితే ఈ నెల 3న మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి రోడ్డుపై యూరియా కోసం రైతులు నిర్వహించిన ధర్నాలో తాను పాల్గొన్నానని గుర్తించిన వాడపల్లి పోలీసులు తనపై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని వాపోయాడు. తాను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తానని.. గుంట భూమి లేనోడివి యూరియా కోసం చేసిన ధర్నాలో ఎందుకు పాల్గొన్నావని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డితో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు తనను విచక్షణారహితంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను నడవలేని స్థితిలో ఉండగా పెయిన్ కిల్లర్ ట్యాబెట్లు వేసి జడ్జి ఎదుట హాజరు పర్చారని, తనను కొట్టిన విషయం జడ్జికి చెప్తే బెయిల్ రాకుండా చేస్తామని బెదిరించారని ఆరోపించాడు. అయితే తాను ఈ విషయాన్ని జడ్జి ఎదుట చెప్పడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స చేయించాలని సిఫారసు చేశారని తెలిపాడు. వైద్య పరీక్షల అనంతరం తనను రిమాండ్ తరలించగా.. 12 రోజులు జైలులో ఉన్న తర్వాత బెయిల్‌పై వచ్చినట్లు వివరించాడు. తనను కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా కొట్టిన వాడపల్లి ఎస్ఐ, పోలీస్ సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు సాయిసిద్ధు తెలిపాడు. కాగా ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పనిచేసిన సమయంలోనూ ఓ రైతును పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచక్షణారహితంగా కొట్టినట్లు ఆరోపణలు ఉండగా.. తాజాగా వాడపల్లిలోనూ అదేవిధమైన ఆరోపణలు రావడం సంచలనంగా మారింది. ఈ విషయంపై ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిని వివరణ కోరగా.. తాను ఎవరినీ కొట్టలేదని, సంబంధిత వ్యక్తిపై నమోదైన కేసులో అతడిని జైలుకు పంపామని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



జశ్వంత్

నల్లగొండ: తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్‌లో ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్న 44వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కనగల్ మండలం కురంపల్లి గ్రామానికి చెందిన తలారి జశ్వంత్ ఎంపికయ్యాడు. జశ్వంత్ ప్రస్తుతం చండూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. జశ్వంత్‌ను తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వి. రమణ, నల్లగొండ సెక్రటరీ బయన్న, స్వామి, కోచ్ దేవేందర్ అభినందించారు.

అడవిదేవులపల్లి విద్యార్థి..



పాతులోతు చిన్ని

అడవిదేవులపల్లి: చండూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోనే 10వ తరగతి చదువుతున్న అడవిదేవులపల్లి మండలం వసరంతండాకు చెందిన పాతులోతు చిన్ని కూడా జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. చిన్ని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల అతడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉరేసుకుని ఆత్మహత్య



రామసాని అక్షయ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: ఇంట్లో చీరతో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన రామసాని అనిల్‌రెడ్డికి చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన అక్షయ(32)తో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అక్షయ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. మంగళవారం ఉదయం అక్షయ తనకు తలనొప్పిగా ఉందని, బయట టీ స్టాల్ నుంచి టీ తీసుకురమ్మని భర్తకు చెప్పి పంపించింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలు నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో అక్షయ బెడ్‌రూంలో వెంటిలేటర్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఇంటికి వచ్చేసరికి అక్షయ ఉరికి వేలాడుతూ కనిపించడంతో చుట్టుపక్కల వారికి విషయం చెప్పాడు. వారు వచ్చి అక్షయను కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త అనిల్‌రెడ్డిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి పిసాటి సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే భార్యాభర్తల మధ్య గత ఆరు నెలలుగా కలహాలు మొదలయ్యాయని, ఈ క్రమంలోనే భర్త అనిల్‌రెడ్డే అక్షయను చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆమె తరపు బంధువులు ఆరోపించారు. కాగా ఇరుపక్షాల పెద్దమనుషులు కూర్చొని మృతురాలి ఇద్దరు పిల్లల పేరిట రూ.5లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడంతో పాటు స్థిరాస్తినంతా పిల్లలకు రాసిచ్చేలా ఒప్పందం చేసుకున్నారని తెలిసింది.

కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

వేములపల్లి: సాగర్ ఎడమ కాలువలో సోమవారం గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన బొల్లెద్దు సతీష్ సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాలువలో గల్లంతయ్యాడు. మంగళవారం కాలువ వెంట గాలింపు చర్యలు చేపట్టగా.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దాచారం గ్రామ శివారులో అతడి మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి పంచనామా నిర్వహించి.. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్తు



గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

నల్లగొండ : సాంకేతిక విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. నరసింహారావు అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విద్యలో విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయమని, వారి కృషి కళాశాల ప్రతిష్ఠను మరింత ఎత్తుకు తీసుకెళ్లిందని అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానం సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలతో దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ డిపార్ట్‌మెంట్ల ఇన్‌చార్జిలు వెంకటేశ్వర్లు, సైదులు, విద్యాసాగర్‌రావు, శ్రీనివాస్, మాధురి, ఏటీ జ్యోతి, అధ్యాపకులు నరసింహ, అంజయ్య, నజీముద్దీన్, ప్రకాష్, యాదగిరి, రవీంద్ర, నీరజ, అలేఖ్య, పీడీ ప్రసాద్, అర్జున్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురై..

- గుండెపోటుతో మహిళ దుర్మరణం
- మృతురాలి స్వస్థలం గరిడేపల్లి మండలం రంగాపురం



లక్ష్మి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురైన మహిళ గుండెపోటుతో మృతిచెందింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన లక్ష్మి(66) రంగారెడ్డి జిల్లా ఆదిబట్లలోని టీసీఎస్ ఎదుట ఉన్న వెంకటేశ్వర హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేస్తుంది. ఈ నెల 21న హాస్టల్‌లో ఉండే మహిళలతో కలిసి బతుకమ్మ ఆడింది. ఈ క్రమంలో అలసటగా ఉందంటూ గదిలోకి వెళ్లింది. ఎడమ చేయి లాగుతోందని చెప్పడంతో జండూబామ్ రాసి పడుకోబెట్టారు. ఛాతిలో కూడా నొప్పి వస్తోందని చెప్పడంతో ఆర్‌ఎంపీని పిలిపించారు. పల్స్ బాగా పడిపోవడంతో రాత్రి 12:30 గంటలకు అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. లక్ష్మి గతంలో సీపీఐ(ఎంఎల్) పార్టీలో క్రియాశీలక సభ్యురాలిగా, ప్రగతిశీల మహిళా సమాఖ్య(పీఓడబ్ల్యూ) సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా పనిచేశారు. లక్ష్మికి భర్త నాగయ్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

లారీ డ్రైవర్‌పై దుండగుల దాడి

- రూ.1000 నగదు, సెల్‌ఫోన్ అపహరణ

నకిరేకల్: లారీ డ్రైవర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి రూ.1000 నగదు, సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలం ఎరసానిగూడెం గ్రామ స్టేజీ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. కట్టంగూర్ ఎస్ఐ ఎం. రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానా రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ అమీర్‌ఖాన్ సోమవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో టైల్స్ లోడ్ చేసుకొని ఏపీలోని విశాఖపట్నంకు బయల్దేరాడు. మంగళవారం తెల్లవారుజామున కట్టంగూర్ మండలం ఎరసానిగూడెం గ్రామ స్టేజీ వద్దకు రాగానే నిద్ర రావడంతో విజయవాడ–హైదరాబాద్ హైవేపై గల బస్ బే వద్ద లారీని ఆపాడు. కిందకు దిగి ముఖం కడుక్కుంటుండగా నలుగురు వ్యక్తులు వచ్చి బలవంతంగా అతడి నోరు మూసి హైవే పక్కకు తీసుకెళ్లి ఐరన్ పైపుతో కొట్టి రూ.1000 నగదు, సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లారు. అనంతరం అమీర్‌ఖాన్ కట్టంగూర్ మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి ఓ వ్యక్తిని ఫోన్ అడిగి తన యజమానికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి



నర్సింహ (ఫైల్)

వేములపల్లి: వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో సోమవారం రాత్రి సాగర్ ఎడమ కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామ శివారులో లభ్యమైంది. మంగళవారం వేములపల్లి ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణానికి చెందిన కోల నర్సింహ(50) సోమవారం సాయంత్రం వేములపల్లి మండలం శెట్టిపాలెంలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి బయటకు వెళ్లి వస్తానని చెప్పి తన ద్విచక్ర వాహనంపై గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాలువ వద్దకు చేరుకున్నాడు. కాలువ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకుని.. ప్రమాదవశాత్తు కాలువలో గల్లంతయ్యాడు. ఎంత సేపటికి నర్సింహ ఇంటికి తిరిగిరాకపోవడంతో బంధువులు కాలువ వద్దకు వచ్చి చూడగా.. కట్టపై అతడి బైక్, చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. కాలువ వెంట గాలించగా.. గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామ శివారులో నర్సింహ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల లారీకి తప్పిన ప్రమాదం

ఆలేరు: ఆలేరు పట్టణ శివారులోని బైపాస్ సమీపంలో మంగళవారం మట్టి రోడ్డు కుంగడంతో గ్యాస్ గోదాంకు సిలిండర్లతో వెళ్తున్న లారీ ఒక పక్కకు ఒరిగింది. సమాచారం తెలుసుకున్న సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వేరే వాహనంలో సిలిండర్లను గోదాంకు తరలించారు. గ్యాస్ సిలిండర్ల లారీ పక్కకు ఒరిగిన ఈ ఘటన తమ దృష్టికి రాలేదని ఆలేరు ఎస్ఐ వినయ్ తెలిపారు.

నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు



దక్కన్ సిమెంట్ పరిశ్రమకు చెందిన కాలనీల్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

హుజూర్‌నగర్: పాలకవీడు మండల పరిధిలోని దక్కన్ సిమెంట్ పరిశ్రమ వద్ద సోమవారం వలస కార్మికులు పోలీసులపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దాడికి పాల్పడిన వారి కోసం మంగళవారం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పరిశ్రమ వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 14 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చరమంద రాజు తెలిపారు. పోలీసులు, ప్రత్యేక బలగాలతో పరిశ్రమ కాలనీల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుల కోసం చుట్టుపక్కల గ్రామాలు, అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నామన్నారు.

రమణేశ్వరంలో కొనసాగుతున్న దసరా ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి: భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రమణేశ్వరంలో దసరా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు సిద్ధగురు రమణానంద మహర్షి ఆధ్వర్యంలో ధ్యానం చేశారు. అనంతరం దేవతలకు, సహస్ర శ్రీచక్రాలు, శివలింగాలకు అభిషేకం చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బుద్ధవనంలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలను తీసుకొస్తున్న మహిళలు

నాగార్జునసాగర్: తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్‌కాలనీ, హిల్‌కాలనీల నుంచి మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలతో బుద్ధవనం తరలివచ్చారు. బుద్ధవనం, విజయవిహార్, మున్సిపల్ సిబ్బంది బతుకమ్మ ఆడారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. అనంతరం లోటస్‌పాండ్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శాంతిలాల్, మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ భానుప్రసాద్, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్‌రావు, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, సాగర్ ఎస్ఐ ముత్యయ్య తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సిమెంట్ లారీ

చౌటుప్పల్ రూరల్: అదుపుతప్పి ఓ సిమెంట్ లారీ విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా దామరచర్లలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం సమీపంలోని ఆందోళ్ మైసమ్మ దేవాలయ సమీపంలోకి రాగానే అదుపుతప్పి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గల డివైడర్‌ను ఢీకొట్టింది. అయితే లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతి వేగంగా నడిపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు దామరచర్లకు చెందిన లారీ డ్రైవర్ మాలోతు సక్రునాయక్‌పై కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ ఎస్ఐ కుసుమ ఉపేందర్‌రెడ్డి తెలిపారు.